## • వేతనాల కోసం మల్టీపర్పస్ వర్కర్ల ధర్నా



మూడు నెలల వేతన బకాయిలతోపాటు అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా బోనకల్లు మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం మల్టీపర్పస్ వర్కర్లు ధర్నాకు దిగారు. అనంతరం ఎంపీడీవో రురావత్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. – బోనకల్లు

## • విద్యార్థినులే టీచర్లుగా..



ఆదిలాబాద్ జిల్లా తాంసిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం విద్యార్థినులు ఉపాధ్యాయులుగా మారారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు వారం రోజులుగా సమ్మెలో ఉండటంతో కేజీబీవీలో ఉపాధ్యాయులు లేక బోధన నిలిచింది. విద్యార్థులే తమ దిగువ తరగతి విద్యార్థినులకు బోధన చేస్తున్న దృశ్యాన్ని బుధవారం 'నమస్తే' క్లిక్‌మనిపించింది. – తాంసి

## • టీచర్ల కోసం కేజీబీవీ విద్యార్థినుల నిరసన



రోజూ పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు కావాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ కేజీబీవీ విద్యార్థినులు ప్లకార్డులతో బుధవారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. 'మా హాస్టల్‌లో పదోతరగతి, ఇంటర్ విద్యార్థినులు ఉన్నా.. ఉపాధ్యాయుల సమ్మెతో చదువు చెప్పేవారు లేక ఇబ్బంది పడుతున్నాం. మా టీచర్లు మాకు చదువు చెప్పే విధంగా చర్యలు తీసుకోవాలి' అని విద్యార్థినులు కోరారు. కాగా డీఈవో వెంకటేశ్వరాచారి కేజీబీవీని సందర్శించి వంటలను పరిశీలించారు. – చంద్రుగొండ

## గుండెపోటుతో ఎస్ఎస్ఏ ఉద్యోగిని మృతి

- పదిరోజులుగా సమ్మె చేస్తుండటంతో
- తీవ్రమైన ఒత్తిడికి గురైన హైమావతి
- ఐదు రోజుల క్రితం గుండెపోటు..
- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి



హైమావతి (ఫైల్)

తిరుమలాయపాలెం/ఖమ్మం రూరల్/ఖమ్మం ఎడ్యుకేషన్, హైదరాబాద్, డిసెంబర్ 18: సమ్మెలో ఉన్న ఎస్ఎస్ఏ ఉద్యోగిని గుండెపోటుతో మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండాకు చెందిన కంచం హైమావతి (42) తిరుమలాయపాలెం ఎమ్మార్సీలో (సమగ్ర శిక్షా అభియాన్ విభాగం) కంప్యూటర్ ఆపరేటర్‌గా 19 ఏండ్లుగా పనిచేస్తున్నది. రెగ్యులరైజ్ చేయాలంటూ ఈ నెల 7 నుంచి సమ్మె చేస్తున్నారు. ఈ ఆందోళనలో ఆమె కూడా పాల్గొన్నది. ఈ క్రమంలో మానసిక ఒత్తిడికి గురైన హైమావతి ఈ నెల 13న అస్వస్థతకు గురైంది. అదే సమయంలో గుండెపోటు వచ్చింది. ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించింది. విషయం తెలుసుకున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు.. బుధవారం పెద్దతండాలోని ఆమె నివాసానికి వెళ్లి హైమావతి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతికలగాలని శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగ నాయకురాలు ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ.. పని ఒత్తిడి, ఉద్యోగ భద్రతపై బెంగ కారణంగానే గుండెపోటు వచ్చి హైమావతి మృతిచెందిందని అన్నారు. ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. హైమవతి మృతికి సర్కారే కారణమని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ ఆరోపించారు. 20వేల మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధాకరమని పేర్కొన్నారు. హైమావతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్

## • మాకుడి రైల్వేస్టేషన్ సమీపంలో పెద్దపులి



కౌటాల, డిసెంబర్ 18 : తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని మాకుడి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం పులి పట్టాలు దాటుతూ స్థానికులకు కనిపించింది. ఇటీవల కాగజ్‌నగర్ డివిజన్‌లో ఇద్దరి వ్యక్తులు, మూడు పశువులపై దాడి చేసిన పులి తర్వాత కనిపించకుండా పోయి బుధవారం ప్రత్యక్షమైంది. మాకుడి రైల్వే స్టేషన్ సిర్పూర్ (టీ) మండలానికి 8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌ను ఆనుకుని సిర్పూర్(టీ) ఫారెస్ట్ రేంజ్ ఉంటుంది. నిత్యం అటు ఇటు రాకపోకలు సాగిస్తాయి. పులి పట్టాలు దాటడాన్ని అధికారులు ధ్రువీకరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# 33 మందికి 'సైబేజ్ కుష్బూ' స్కాలర్‌షిప్‌లు

### చెక్కులు అందుకున్న ఎంఎల్‌ఆర్ఐటీ, సీఎంఆర్ విద్యార్థులు

### అభినందించిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్/దుండిగల్, డిసెంబరు 18 : ప్రతిభ ఉండి, స్తోమత లేకుండా చదువుకోలేని విద్యార్థులకు పూణెకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ సైబేజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఉపకార వేతనాలను అందజేస్తుంది. ఆ సంస్థ నుంచి గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్‌లోని 19 మంది ఫస్టియర్ విద్యార్థులకు రూ.19.5 లక్షల ఉపకార వేతనం మంజూరైంది. అలాగే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లోని మర్రిలక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్ఐటీ) కళాశాలకు చెందిన 14మంది విద్యార్థులు కూడా సైబేజ్ కుష్బూ స్కాలర్‌షిప్‌లను అందుకున్నారు. చెక్కులను విద్యార్థులకు బుధవారం గచ్చిబౌలిలోని కంపెనీ కార్యాలయంలో సైబేజ్ సంస్థ చైర్మన్ రీతూ నతాని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులకు సైబేజ్ సహకారం అందించడం అభినందనీయమని తెలిపారు. తమ అరుంధతి దవాఖాన ద్వారా ఉచితవైద్య సేవలను అందిస్తున్నామని, స్పోర్ట్స్ కోటా కింద విద్యార్థులకు ప్రతిఏడాది రూ.1.5కోట్ల స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఫౌండేషన్ గత విద్యా సంవత్సరంలో రూ.8.6లక్షలు, ఈ ఏడాది రూ.10.55లక్షల మొత్తాన్ని స్కాలర్‌షిప్‌ల కింద అందజేసినట్టు సైబేజ్ సాఫ్ట్‌వేర్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సురేశ్ మమునూరు, వైస్ ప్రెసిడెంట్ పుచ్చ వెంకటేశ్వర శర్మ, సీనియర్ సీఎస్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ సురేశ్ గౌడ్, సీఎంఆర్ కళాశాల కార్యదర్శి గోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ మేజర్ నారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీనివాస్‌రావు, ప్లేస్‌మెంట్ హెడ్‌లు రవిచంద్ర, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, అంజనా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్కులను అందజేసిన సైబేజ్ సాఫ్ట్‌వేర్ ప్రతినిధులు

# సామగ్రి ఉండగానే షాపుల కూల్చివేత

- లక్ష్మీగూడలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు
- అడ్డుకున్న స్థానికులు.. అధికారులతో వాగ్వాదం
- కమర్షియల్ కాంప్లెక్స్‌ను వదిలి తమ దుకాణాలు కూల్చివేయడంపై బాధితుల మండిపాటు



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ ప్రాంతంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు సందర్భంగా సామగ్రి ఉండగానే తమ షాపులను కూల్చివేశారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. లక్ష్మీగూడ నుంచి వాంబే కాలనీ వరకు షెడ్లు, ఇతర నిర్మాణాలను రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు నడుమ అధికారులు బుధవారం కూల్చివేశారు. కనీసం తమకు సామగ్రి తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా షాపులను ఎలా కూలుస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిని పక్కకు తప్పించి యథావిధిగా కూల్చివేతలు చేపట్టారు. రహదారికి ఓవైపున ఉన్న షాపులను, ఇతర నిర్మాణాలను కూల్చిన అధికారులు, మరోవైపున ఫుట్‌పాత్‌ను ఆనుకొని ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్ జోలికి వెళ్లకపోవడంపై స్థానికులు మండిపడ్డారు. పెద్దల జోలికి వెళ్లకుండా అధికారులు పేదలమైన తమ బతుకులను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కూల్చివేతల విషయం తెలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. అకారణంగా ప్రజల ఆస్తులను కూల్చివేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా ఇదే ప్రాంతంలో ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్ భవనాలు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌వేనని స్థానికులు చెప్తున్నారు. వాటి జోలికి అధికారులు వెళ్లకుండా ఉండేందుకే ఆయన వచ్చారని అంటున్నారు. ఎమ్మెల్యే రాగానే అధికారులు సైతం కూల్చివేతల ప్రక్రియను నిలిపివేయడం గమనార్హం.

## ఆక్రమణల గుర్తింపులో అక్రమాలు

- ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో ముగ్గురు అధికారుల అవకతవకలు
- నీటిపారుదలశాఖ, హైడ్రా గుర్తింపు
- చర్యలకు రంగనాథ్ సిఫారసు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 18 ( నమస్తే తెలంగాణ ): హైదరాబాద్‌లోని ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో అక్రమాలు జరిగినట్టు నీటి పారుదలశాఖ, హైడ్రా అధికారుల తనిఖీల్లో తేలింది. ఆక్రమణదారులకు సహకరిస్తూ అధికారులు ఎఫ్‌టీఎల్ మ్యాపులో మార్పులు చేసినట్టు అధికారులు గుర్తించారు. నీటిపారుదల, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ విభాగంలోని ముగ్గురు సీనియర్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ సిఫారసు చేశారు. ఎస్ఈ వెంకటేశం, ఈఈలు బీమ్ ప్రసాద్, శేఖర్ రెడ్డిలపై పెనాల్టీ చర్యలు ప్రారంభించింది. ఒకరికి చెందిన ఆస్తి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రాదంటూ తప్పుడు క్లెయిమ్ చేసి అక్రమ నిర్మాణాలను సులభతరం చేశారని ఈ ముగ్గురిపై ఆరోపణలు ఉన్నాయి. వాస్తవాలు తప్పుగా చూపుతూ నివేదిక ఇచ్చారనే అభియోగంతో వీరిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి రంగనాథ్ తెలిపారు. ఈ మేరకు ఉస్మాన్‌సాగర్ పర్యావరణ సమగ్రతకు భంగం కలిగించేలా వ్యవహరించిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలను తీసుకోవాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇండ్ల కోసం వసూళ్లు

### 5 వేలు దండుకున్న కాంగ్రెస్ నాయకుడికి దేహశుద్ధి

నల్లబెల్లి, డిసెంబర్ 18: ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ఓ కాంగ్రెస్ నాయకుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు డబ్బులు వసూలు చేసిన ఘటన వరంగల్ జిల్లా లెంకాలపల్లిలో జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ఓ కాంగ్రెస్ నాయకుడు ఓ ఇద్దరి వద్ద రూ.5 వేల చొప్పున వసూలు చేశాడు. దీంతో తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు యత్నిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న ఆ చోటా లీడర్ తాను తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించాలని నిర్ణయించుకున్నాడు. ఒకరికి డబ్బులు తిరిగి ఇవ్వగా, మరొకరికి డబ్బులు వాపస్ ఇస్తున్న క్రమంలో ఆ చోటా లీడర్‌పై చెప్పుతో దాడి చేశాడు.

## గొర్రెల పంపిణీ కోసం

### నేడు గొల్ల కురుమల ధర్నా

హైదరాబాద్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన గొర్రెల పంపిణీని మళ్లీ ప్రారంభించాలని డిమాండ్‌తో గొల్ల కురుమలు పోరుబాట పట్టారు. ఈ మేరకు ఇందిరాపార్కులో నేడు ధర్నా నిర్వహించనున్నారు. కాంగ్రెస్ హామీ మేరకు రూ. 2లక్షలు బదిలీ, గొర్రెలు పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు.

# సర్కారు బడుల్లో 'ఫుడ్ ఫెస్టివల్'

- ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో నిర్వహణ
- 55 పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్
- పాఠశాలల్లో 383, కేజీబీవీల్లో 168 మందికి అస్వస్థత
- విమర్శలు రావడంతో నష్ట నివారణ చర్యల్లో సర్కారు

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : వరుస ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో తీవ్ర విమర్శలపాలైన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు ఈ అంశాన్ని డైవర్ట్ చేసే పనిలో పడింది. దీంట్లో భాగంగా 'తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్' పేరుతో బడుల్లో కొత్త కార్యక్రమానికి తెరతీసింది. 21న నిర్వహించే పేరెంట్ టీచర్ సమావేశంను 'తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్' థీమ్‌తో నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. పాయిజన్ ఘటనలతో రాష్ట్రప్రభుత్వం అప్రతిష్ఠ మూటగట్టుకుంది. 55 పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూశాయి. సర్కారు స్కూళ్లల్లో 383, కేజీబీవీల్లో 168 మంది అస్వస్థతకు గురై దవాఖానల పాలయ్యారు. నారాయణపేట జిల్లా మాగనూరులో 10 రోజుల వ్యవధిలో మూడుసార్లు ఫుడ్ పాయిజన్ అయ్యింది. మన బడిలో ఆహారోత్సవం పేరుతో పౌష్టికాహారంపై దృష్టిసారించాలని సూచించింది. సర్వపిండి, సకినాలు, నువ్వుల/రాగిలడ్డు, మక్క గారెలు, ఆకుకూరలు, వంటి ఆహారపదార్థాలను తయారుచేసేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సూచించింది. వీటిని ఎలా తయారుచేయాలో సూచించే పోస్టర్‌ను తల్లిదండ్రులకు అందజేయాలని సూచించింది.



ఖమ్మంలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, జడ్జి కేవీ చంద్రశేఖర్‌రావు

**పోలీస్ పహారాలో దానవాయిగూడెం గురుకులం**

ఖమ్మం జిల్లా దానవాయిగూడెంలోని బీసీ బాలికల గురుకుల హాస్టల్‌లో గత నెలలో పదోతరగతి విద్యార్థినిని ఎలుకలు కొరకగా చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. హాస్టల్ ప్రాంగణంలోకి ఎవరినీ అనుమతించకుండా ప్రధాన గేటు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులతోపాటు పలు పనుల నిమిత్తం వచ్చిన వారిని లోనికి అనుమతించకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. కుమార్తె అనారోగ్యంతో ఉన్నదని, కలిసి వెళ్లేందుకు వచ్చామని పలువురు వేడుకున్నా పేరెంట్స్‌కు అనుమతి లేదంటూ పోలీసులు తేల్చిచెప్పారు. అయినప్పటికీ తల్లిదండ్రులు గంటలకొద్దీ గేటు వద్దే నిరీక్షించారు. ఎంతో దూరం నుంచి ఎన్నో ఆశలతో హాస్టల్‌లో తమ పిల్లలను కలిసేందుకు వచ్చిన పేరెంట్స్ పోలీసుల చర్యలతో నిరుత్సాహంతో వెనుదిరిగారు. అంతేగాక హాస్టల్‌లో బాలికపై ఎలుకల దాడి ఘటన జరిగిన విషయం తెలుసుకునేందుకు వచ్చిన పలు విద్యార్థి సంఘాలను సైతం అనుమతించలేదు. హాస్టల్‌లో విచారణ జరుగుతున్నదని, అనుమతి లేదంటూ సీఐ ఉస్మాన్ షరీఫ్ అక్కడికి వచ్చిన పేరెంట్స్‌తో–

## ఎలుకల దాడి ఘటనపై జడ్జి విచారణ

గురుకుల ప్రిన్సిపాల్, విద్యార్థినులను కలిసి వివరాల సేకరణ ఖమ్మం జిల్లా దానవాయిగూడెం బీసీ బాలికల గురుకుల హాస్టల్‌లో టెన్త్ విద్యార్థిని లక్ష్మీభవాని కీర్తిపై జరిగిన ఎలుకల దాడి ఘటనపై ఖమ్మం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ చంద్రశేఖర్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. హాస్టల్‌ను సందర్శించిన ఆయన సుమారు రెండు గంటలపాటు పూర్తిస్థాయిలో విచారణ జరిపారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు విద్యార్థినులను స్వయంగా కలిసి వివరాలు తెలుసుకున్నట్టు తెలిసింది. అనంతరం ఖమ్మం మమత హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థిని ఆయన పరామర్శించారు. వైద్యులను అడిగి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

## స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లు ఆమోదం

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : శాసనమండలిలో బుధవారం మూడు బిల్లులు ఆమోదం పొందాయి. ఇందులో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఆమోదం పొందింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు. అలాగే జీఎస్టీ పన్ను సవరణ బిల్లులను కూడా ఆమోదించారు.

## జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ ప్రెసిడెంట్‌పై చర్యలు తీసుకోండి

- కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్18 (నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు బీ రవీంద్రనాథ్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు వారాల్లో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. సొసైటీ రికార్డులు లోతుగా పరిశీలించాలని కూడా ఆదేశించింది. చర్యలు తీసుకునేందుకు కాల వ్యవధి లేకుండా చేయాలన్న సహకార సంఘాల అధికారుల అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. రవీంద్రనాథ్‌పై అనర్హత వేటు వేయాలంటూ తాము అక్టోబర్ 26న ఇచ్చిన వినతిపత్రంపై కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ సొసైటీ సభ్యులు జ్యోతి ప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ టీ మాధవీదేవి బుధవారం విచారణ జరిపారు. పిటీషనర్ల తరఫున న్యాయవాది వాదిస్తూ, రవీంద్రనాథ్ మోసపూరితంగా సొసైటీలో సభ్యత్వం తీసుకుని ఎన్నికల్లో పోటీచేశారన్నారు. వాదనల తర్వాత ఆరు వారాల్లో ప్రెసిడెంట్‌పై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది.

## శ్రీధర్‌రెడ్డి హత్య కేసును ఛేదించండి

- హంతకులను అరెస్టు చేయండి
- గోదాం దొంగలను పట్టుకోవాలి
- వనపర్తి కలెక్టర్‌కు మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి

వనపర్తి, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో మే 23న అర్ధరాత్రి దారుణ హత్యకు గురైన బీఆర్ఎస్ నేత, రైతు శ్రీధర్‌రెడ్డి హత్యకేసులో హంతకులను గుర్తించలేదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పెద్దదగడ వద్ద గోదాంలో ఉన్న వేల టన్నుల ప్రభుత్వ ధాన్యం దొంగిలించినా సులో పురోగతి లేదని పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం కలెక్టర్ ఆదర్శ్ సురభికి బహిరంగ లేఖ రాశారు. శ్రీధర్‌రెడ్డి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఒకరోజంతా స్వీకరించకుండా తాత్సారం చేశారని ధ్వజమెత్తారు. అధికార పార్టీ పెద్దల అండదండలతో హత్య జరగడంతోనే పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

## యూపీఎస్సీపై టీజీపీఎస్సీ అధ్యయనం

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ నియామకాల్లో అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) యూపీఎస్సీ పనితీరుపై అధ్యయనం చేసింది. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం నేతృత్వంలో ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఐదుగురు సభ్యుల బృందం బుధవారం యూపీఎస్సీ చైర్మన్ ప్రీతి సుడాన్ సహా కమిషన్ సభ్యులతో భేటీ అయ్యింది. రిక్రూట్‌మెంట్‌లో అనుసరిస్తున్న పద్ధతులు, డిసిప్లినరీ కేసులు, ఆర్థిక స్వయంప్రతిపత్తి, ఐటీ వినియోగం,

# పెండ్లి వేడుకలో వివాదం!

- అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కుమార్తెతో ఐపీఎస్‌కు వివాహం నిశ్చయం
- కాంగ్రెస్ జెండాలతో ర్యాలీగా వెళ్దామన్న వధువు బంధువులు
- నిరాకరించిన వరుడు
- మాజీ ఎమ్మెల్యే భార్యకు అస్వస్థత
- చివరకు సద్దుమణిగిన సమస్య
- ఒక్కరోజు ఆలస్యంగా ఒక్కటైన జంట



అలంపూర్, డిసెంబర్ 18 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూతురి వివాహ వేడుకలో వివాదం చోటుచేసుకున్నది. అయితే రెండు కోణాల్లో వార్తలు హల్‌చల్ అవుతున్నాయి. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కూతురికి అధికారిగా ఎంపికైన వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. పెద్దలు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఏపీలోని గుంటూరు పట్టణంలోని పట్టాభిపురంలోగల డాన్‌బాస్కో చర్చిలో మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటలకు వేడుక జరగాల్సి ఉన్నది. తెలంగాణ ప్రాంత వివాహ సంప్రదాయం ప్రకారం వరుడి ఇంటికి నేరుగా వెళ్లకుండా ఇంటికి కొంత సమీపంలో విడిది చేయాలి. అక్కడి నుంచి వరుడి తరఫు బంధువులు వచ్చి పెండ్లి కూతురు తరఫు వారిని మర్యాద పూర్వకంగా ఆహ్వానించాల్సి ఉన్నది. సంప్రదాయం ప్రకారం హూందాకు తగ్గట్టు పెండ్లి కుమారుడి తరఫు వారు కారు సమయానికి పంపడం లేటయ్యిందనే కారణంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకున్నది. స్థానిక పోలీస్ యంత్రాంగం కలుగజేసుకుని ఉద్రిక్తతను సద్దుమణిగించినట్టు సమాచారం. కాగా మరో విధమైన గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. పెండ్లి ఇంటి నుంచి వివాహ వేదిక వరకు కాంగ్రెస్ పార్టీ జెండాలతో ఊరేగింపుగా వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే తరఫు బంధువుల డిమాండ్‌కు వరుడి తరఫు వారు ఒప్పుకోలేదని.. దీంతో ఇరుకుటుంబాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో పెండ్లికూతురి తల్లి కొంత అస్వస్థతకు గురవడంతో వేడుక ఒకరోజు వాయిదా పడింది. ఇరువర్గాల బంధువులు, పెద్దలు సంప్రదింపులు జరిపి సర్దిచెప్పడంతో బుధవారం వారి మత సంప్రదాయం ప్రకారం వివాహ వేడుక జరిగింది. ప్రశాంత వాతావరణంలో పెండ్లి వేడుకలు ముగియడంతో ఇరువర్గాల వారు ఊపిరి పీల్చుకున్నారు.

## పేదల భూమిపై కొనసాగుతున్న విచారణ

- దక్కన్ సిమెంట్ వ్యవహారంపై వివరాల సేకరణ
- పలిమెల తహసీల్దార్‌పై చర్యల బాధ్యత సీసీఎల్ఏకు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 18 (నమస్తేతెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దులోని పలిమెల గ్రామంలో పేదల భూమి దక్కన్ సిమెంట్స్‌కు కేటాయించడంపై అధికారులు విచారణ జరుపుతున్నారు. 'మరో లగచర్ల.. పలిమెల' అనే శీర్షికన బుధవారం 'నమస్తే తెలంగాణ' మెయిన్ పేజీలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. పలిమెలలో రైతుల భూముల రిజిస్ట్రేషన్‌పై అధికారులు విచారణ సాగిస్తున్నారు. 2008లో పలిమెలలో రైతులు కాస్తులో ఉన్న భూములను మంథని, ధన్వాడ, లద్నాపూర్ తదితర గ్రామాల నేతలు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇప్పుడు గుట్టుగా దక్కన్ సిమెంట్ సంస్థకు కట్టబెట్టారు. అసలు దక్కన్ సంస్థ ఇక్కడికి ఎలా వస్తుంది? వెనుక సూత్రధారులు ఎవరు? భూముల రిజిస్ట్రేషన్ చేయిస్తున్నది ఎవరు? తహసీల్దార్ తన కార్యాలయంలో కాకుండా ఇతరచోట రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం ఏమున్నది? తెర వెనుక ఎవరున్నారు? అని అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ విషయమై సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ రైతులతో చర్చలు జరిపి వివరాలు సేకరించి తహసీల్దార్‌పై వచ్చిన ఆరోపణలను కలెక్టర్‌కు విన్నవించినట్టు తెలిసింది. దీంతో తహసీల్దార్‌పై విచారణ, చర్యల బాధ్యతలను సీసీఎల్ఏకు